క్లుప్తంగా

ఐదుగురు పోలీసులకు ఎస్పీ ప్రశంస



ఎస్ఐ మల్లికార్జునకు ప్రశంసాపత్రం అందిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

ఓర్వకల్లు: పోలీసు శాఖలో పని చేస్తున్న ఐదుగురిని ఎస్పీ కృష్ణకాంత్ రివార్డులతో అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు. మంగళవారం జరిగిన జిల్లాస్థాయి నేర సమీక్షలో గుడ్ సర్వీసు ఎంట్రీ కింద ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ మల్లికార్జున, హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి, పోలీసులు బలరాం, ఖాదర్‌బాషా, హోంగార్డు పుల్లయ్యను ప్రశంసా పత్రాలతో పాటు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రివార్డులను అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసు శాఖలో అత్యుత్తమ సేవలు అందించి మంచి పేరు తీసుకరావాలని ఎస్పీ సూచించినట్లు వారు పేర్కొన్నారు.

ప్రతి విద్యార్థికి కానుక అందించాలి

గూడూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లను అందించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపై ఉందని ఎంఈఓ సునీలమ్మ పేర్కొన్నారు. కె.నాగలాపురంలో విద్యార్థులకు అందించిన కిట్లను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలలకు వచ్చే విద్యార్థుల అవసరం మేరకు విద్యాకానుక కిట్లను మంజూరు చేసిందన్నారు. రెండు రోజులుగా విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు జగనన్న విద్యా కానుక కిట్లను జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తరగతుల వారీగా విద్యార్థులకు కిట్లను అందించాలని సూచించారు.

కేవీ సుబ్బారెడ్డిలో ప్రాంగణ ఎంపికలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన సన్‌గ్లైరీ టెక్నాలజీకి ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 96 మంది విద్యార్థులు పాల్గొనగా 35 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రాజెక్టు మేనేజర్ ఆనంద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సన్‌గ్లైరీ టెక్నాలజీ సంస్థ శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కరెస్పాండెంట్ విజయ లక్ష్మమ్మ, ప్రిన్సిపల్ కన్నకుమార్ తదితరులు అభినందించారు.

నేడు ఉపాధి సిబ్బందితో పీడీ సమీక్ష

ఓర్వకల్లు: మండలంలో పనిచేస్తున్న జాతీయ ఉపాధి హామీ సిబ్బందితో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఏపీఓ కుమార్‌సాయినాథ్ తెలిపారు. ఉపాధి కూలీల సంఖ్య, పనుల పురోగతి, పండ్ల తోటల సాగుపై చర్చిస్తారన్నారు. ముందుగా క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా కాల్వబుగ్గ నర్సరీలో అభివృద్ధి పనులు, పలు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. కావున ఆయా ప్రాంతాల క్షేత్ర, సాంకేతిక సహాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దండి

కర్నూలు(సెంట్రల్): గార్గేయపురం సమీపంలోని నగరవనం, ఓర్వకల్లు రాక్ గార్డెన్స్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆమె మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ టూరిజం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి కళాశాల, పాఠశాలల్లో విద్యార్థులకు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై అవగాహన కోసం టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కేతవరంలోని ఆది మానవుడి చిత్రాలు, తుగ్గలి మండలం ఎర్రగుడి సమీపంలో అశోకుని శిలా శాసనాలను ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. టూరిజం రీజనల్ డైరెక్టర్ రామచంద్ర, జిల్లా టూరిజం అధికారి విజయ, కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పత్తి ఓబులయ్య, జిల్లాఅటవీ శాఖ అధికారి శివశంకర్‌రెడ్డి, డీఈఓ రంగారెడ్డి, ఆర్కియలాజీ ఏడీ రజిత, కేవీఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ ఇందిరాశాంతి పాల్గొన్నారు.

16 నుంచి క్రీడా పోటీలు

కర్నూలు(రూరల్):ప్రపంచ ఒలింపిక్ డే సందర్భంగా కర్నూలు నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థులకు ఇంటర్ స్కూల్స్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జగదీశ్‌కుమార్, శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. 16న తైక్వాండో, స్కేటింగ్, బాస్కెట్‌బాల్, జూడో, అథ్లెటిక్స్, 17న యోగా, టెన్నికాయిట్, వాలీబాల్, సెపక్ తక్రా, హ్యాండ్‌బాల్ 18న ఉషూ, స్విమ్మింగ్, 19న ఫుట్‌బాల్, కబడ్డీ, జిమ్నాస్టిక్, 20న చెస్, క్యారమ్స్ పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 92474 00100 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రాణాలు నిలుపుతున్న ఆరోగ్యశ్రీ

- ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం
- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం, కోలుకునేందుకు ఆర్థిక సాయం
- ఇతర రాష్ట్రాల్లోనూ వైద్య చికిత్సలు పొందేలా పథకం విస్తరణ

ఆరోగ్యశ్రీ ద్వారా మండలాల వారీగా చేకూరిన లబ్ధి వివరాలు

మండలం	లబ్ధిదారులు	చేకూరినలబ్ధి (రూ.కోట్లు)
గడివేముల	3,754	9.25
పాణ్యం	4,358	16.69
ఓర్వకల్లు	5,657	16.68
కల్లూరు	5,184	16.68



గడివేముల: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పూర్వ వైభవం తీసుకొచ్చారు. ఎంతో మందికి ప్రాణం పోసి వైఎస్సార్ పేరు చెబితేనే ఆరోగ్యశ్రీ అన్నట్లుగా గుర్తుకొచ్చే ఈ పథకాన్ని ఆయన తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం నీరుగార్చింది. ఈ స్థితిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో మరో రెండడుగులు ముందుకేసి ఆరోగ్యశ్రీ పరిధి పెంచింది. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఒక్కరికీ అత్యున్నత స్థాయి వైద్యం అందించేలా చర్యలు చేపట్టింది. రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని 1,308కి పైగా కార్పొరేట్ ఆసుపత్రులు, 718 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఎక్కడైనా అత్యాధునిక చికిత్స పొందేలా పథకాన్ని విస్తరించారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఆరోగ్య భరోసా వర్తింపజేస్తూ ఈ పథకం అమలు కోసం కొట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పొరుగు రాష్ట్రాల్లో వైద్యసేవలు పొందడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉందని పేద, మధ్య తరగతి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

2,434 రోగాలకు వర్తింపు

ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా రోగుల నుంచి ఒక్క పైసా ఆశించకుండా కార్పొరేట్ వైద్యం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యంతో 1,973 ఆసుపత్రుల్లో 2,446 రోగాలకు చికిత్స పొందే వెసులుబాటు ఈ పథకం ద్వారా కల్పించారు.

సద్వినియోగం చేసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని వైద్య చికిత్సలు అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలి. వివిధ రోగాలతో బాధపడే వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదిస్తే ఆరోగ్యశ్రీ కింద చికిత్స కోసం కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తారు. ఆరోగ్యశ్రీ పథకం నిరుపేదలకు వరం.
– డాక్టర్ రఘు, జిల్లా కో–ఆర్డినేటర్, ఆరోగ్యశ్రీ

ఆరోగ్య ఆసరా

ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స చేయించుకుని కోలుకునే సమయంలో పోషణ నిమిత్తం బాధితుడికి ప్రభుత్వం ఆరోగ్య ఆసరా పథకం ద్వారా అండగా నిలుస్తోంది. అలాగే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కదలలేని స్థితిలో ఉన్న వారికి ఈ పథకం వర్తింపజేస్తున్నారు. ఇందులో 12 జబ్బులను ప్రభుత్వం చేర్చింది. పాణ్యం నియోజకవర్గంలో మొత్తం 21,923 మందికి ఆరోగ్య శ్రీ ద్వారా లబ్ధి చేకూరినట్లు అధికారులు వెల్లడించారు.

పునర్జన్మ ప్రసాదించారు



నేను ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గతేడాది కర్నూలులోని ఓమ్నీ ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ జరిగింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్ చేశారు. ఆరోగ్యం కుదుటపడింది. సర్జరీ తర్వాత రూ.2 వేలు అకౌంట్లో వేశారు. మూడు నెలలకోసారి ఫాలోఅప్‌కు వెళ్లినప్పుడు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారు. గతంలో ఖరీదైన వైద్యం చేయించుకోలేక పేద ప్రజల గుండెలు ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పునర్జన్మ ప్రసాదించారు.
– సామేలు, బూజునూరు గ్రామం, గడివేముల మండలం

పేదలకు కార్పొరేట్ వైద్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదవారికి సైతం కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. గత నెలలో నాకు హార్ట్‌ఎటాక్ వచ్చింది. కుటుంబసభ్యులు వెంటనే నంద్యాలలోని కేవీఆర్ హాస్పటల్‌లో చేర్పించారు. ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం రూ.1.10 లక్షలు ఖర్చు చేసి గుండె ఆపరేషన్ చేశారు. నా ప్రాణాలు నిలబెట్టింది ఆరోగ్య శ్రీ పథకమే. – షేక్ ఎండీ ఇబ్రహీం, గడివేముల

అన్ని రకాల వ్యాధులకు వర్తింపు



పేద, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బంది లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేశారు. నాకు గుండెలో ఐదు చోట్ల అడ్డంకులు ఉన్నాయని వైద్యులు తెలిపారు. కర్నూలులోని మెడికవర్ ఆసుపత్రిలో గుండెకు సర్జరీ చేయించుకున్నాను. సర్జరీకి దాదాపు రూ.3 లక్షల దాకా ఖర్చయిందని వైద్యులు చెప్పారు. ఆసుపత్రిలో నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించారు. ఇప్పుడు ఆరోగ్యం బాగా ఉంది. అంత ఖరీదైన ఆపరేషన్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయించిన జగనన్నకు రుణపడి ఉంటా.
– వంటా జయమ్మ, బూజునూరు గ్రామం, గడివేముల మండలం

ఉపాధి బకాయిలు చెల్లించాలి

గూడూరు రూరల్: ఉపాధి కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటరాముడు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం చనుగొండ్లలో పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. ప్రతి రోజు ఉపాధి పనులకు వందల సంఖ్యలో కూలీలు హాజరవుతున్నా సరైన వేతనం అందడం లేదని, ఏడు వారాలుగా ప్రభుత్వం కూలి సొమ్ము ఖాతాలకు జమ చేయలేదన్నారు. ఉపాధి కూలీలకు సౌకర్యాలు, పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే కూలీలతో కలిసి ధర్నాలు, ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. డివిజన్ కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

కల్లూరు: ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఉలిందకొండ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు, ఏపీ వకాస మండల కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. మంగళవారం సి.బెళగల్ అంగన్‌వాడీ కేంద్రం– 6లో సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి అధ్యక్షతన జన భాగిధారి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సేవలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద మహిళలు, వారి పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తోందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాలు నేర్చుకున్న చిన్నారులకు ప్రాథమిక పాఠశాలల్లో చేరేందుకు ధ్రువపత్రాలను అందజేశారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం


ప్యాలకుర్తిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆయన మంగళవారం ప్యాలకుర్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ యాదవ్, దిశ కమిటీ సభ్యులు రమేష్‌తో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచనలిచ్చారు. ముస్లిం వీధి, బీసీ కాలనీ వాసులు మాట్లాడుతూ.. తమ కాలనీల్లో నీటి సమస్య పరిష్కరించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, మరికొందరు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు.ఆయా పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాలని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలందేలా చూడాలంటూ ఎమ్మెల్యే ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు సూచించారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి

ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం పేదల కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, ఏపీఎం పుష్పావతి, ఏపీఓ రమాదేవి, స్థానిక నాయకులు శ్రీనివాసులు, మాదన్న, మిన్నెల్ల, సులేమాన్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


కల్లూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: విద్యతో చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు, ఎంఈఓ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య చిన్నారులకు ఇచ్చే గొప్ప ఆస్తి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక ద్వారా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ, బెల్టు, టై, బ్యాగు తదితర వస్తువులను ఉచితంగా అందిస్తున్నారన్నారు. పేదలు తమ పిల్లల చదువులకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద పథకం ద్వారా నూతన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. మనబడి నాడు–నేడు పథకం కింద పాఠశాల రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు. ప్రధానోపాధ్యాయులు హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరయ్య, శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

గడివేముల: ఇష్ట దైవాన్ని స్మరించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో శ్రీరామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయంలోని గణపతి, నందీశ్వర, కుమారస్వామి, నాగదేవత, భవానీ సమేత రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖర్‌రెడ్డి, నంద్యాల వ్యవసాయ కమిటీ చైర్మన్ శిరువ శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి, దేశం నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే తన స్వగృహంలో.. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద నియోజకవర్గంలోని అర్హులైన 16 మందికి రూ.23,95,000 చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ వర్తించని వ్యాధులకు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సహాయం చేస్తుందన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

కోడుమూరు రూరల్: పిల్లల బాల్య దశలో మొదటి ఆరు సంవత్సరాలు ఎంతో విలువైనవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజమ్మ సూచించారు. మంగళవారం కోడుమూరులోని అంగన్‌వాడీ సెంటర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జనభాగీదారి ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించి పిల్లల సామూహిక వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమ్మ మాట్లాడుతూ.. బాల్యదశలో మొదటి మూడు సంవత్సరాలు అమ్మ ఒడికి పరిమితమైన పిల్లలు ఆ తర్వాత బయటి ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తారన్నారు. ఈ వయసులో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ఆట, పాట, కథల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యను అందించడం ద్వారా పిల్లల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడుతుందన్నారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా చూసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని రాజమ్మ సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కోడుమూరులో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' ర్యాలీని నిర్వహిస్తున్న సిబ్బంది, చిన్నారులు

ఈ- పోర్టల్‌లో నమోదు చేయండి

పాణ్యం: కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి గ్రామాభివృద్ధి ప్రణాళికలను ఈ–గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎంపీపీ ఉసేన్‌బీ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి, గ్రామాల కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అనుసంధానంగా గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి ఈ–గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులతో చర్చించి తీర్మానాలు చేసి శాశ్వత అభివృద్ధికి పాటుపడాలన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దని సూచించారు. ఎంపీడీఓ దస్తగిరి, ఈఓఆర్డీ భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన రెవెన్యూ అధికారులు


తహసీల్దార్ శేషఫణి, డీటీ కృష్ణమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న మండల రెవెన్యూ అధికారులు


గూడూరులో తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

సి.బెళగల్: మండలానికి నూతనంగా నియమితులైన ఇద్దరు రెవెన్యూ అధికారులు మంగళవారం విధుల్లో చేరారు. కోడుమూరు నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్ శేషఫణి, కల్లూరు మండలం నుంచి వచ్చిన రీసర్వే డీటీ కృష్ణమూర్తి సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ ప్రజల భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని వారు పేర్కొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

మంగళవారం బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శేషఫణి, రీ సర్వే డీటీ కృష్ణమూర్తికి మండల వీఆర్వోలు, రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బంది పూలమాలలతో స్వాగతం పలికారు. వీఆర్వోలు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని, బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తహసీల్దార్ సూచించారు. మండలంలోని బురాన్‌దొడ్డి, పలుకుదొడ్డి, పోలకల్ గ్రామాలలో జరుగుతున్న రీసర్వేలను పకడ్బందీగా చేపట్టాలని డీటీ వీఆర్వోలను ఆదేశించారు. ఏఎస్‌ఓ ఆదినారాయణ, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బాధ్యతగా పనిచేయండి

గూడూరు: రెవెన్యూ సిబ్బంది బాధ్యతగా పని చేసి ప్రజలకు సేవలందించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అర్థవంతంగా సాగిన మండల మీట్


సి.బెళగల్ మండల మీట్‌లో మాట్లాడుతున్న అధికారులు

సి.బెళగల్: పేదల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో కొంతమంది అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంపై సి.బెళగల్ మండల పరిషత్ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన ఎంపీడీఓ రాముడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీడీఓ గత సమావేశంలో జరిగిన చర్చ, తీర్మానాలు, చేపట్టిన పనులు, అభివృద్ధి అంశాలను సభకు తెలిపారు. ఆయా శాఖలలో చేపట్టిన అంశాలను, నివేదికలను అధికారుల సభలో చదివి వినిపించారు. వివిధ శాఖల అధికారులు గ్రామాలలో అమలవుతున్న పనులను సభకు తెలియజేస్తున్న సందర్భంలో సి.బెళగల్, సంగాల సర్పంచ్ పాండురంగన్న, హనుమంతు, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్‌ఎం బాష తదితరులు అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. మండలంలో బాలికలకు ప్రత్యేక పాఠశాల, వసతి గృహం ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. అలాగే పోలకల్, సి.బెళగల్ పీహెచ్‌సీలలో నలుగురు వైద్యులు ఉన్నప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండటంలేదని సభ్యులు ఆరోపించారు. మండల సమావేశానికి సైతం నలుగురు వైద్యులు గైర్హాజరు కావడంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీపీ ఎంపీడీఓను ఆదేశించారు. సి.బెళగల్ డాక్టర్ మిథున్‌రెడ్డి సమావేశానికి ఆలస్యంగా వచ్చారు. అలాగే హౌసింగ్, వైకేపీ, పంచాయతీ రాజ్, రక్షణాంశాలపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. వైస్ ఎంపీపీలు నాయకంటి మంగమ్మ, తలారి బీసమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. సభ అర్థవంతంగా సాగడంపై ఎంపీడీఓ, ఎంపీపీ సభ్యులు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

గ్రామ కార్యదర్శిపై అసభ్యకర పోస్టులు

పాణ్యం: మండల పరిధిలోని కొలురు గ్రామ కార్యదర్శి గురించి అదే గ్రామానికి చెందిన దేవదత్తు, బి.స్వామి వాట్సాప్‌లో అసభ్యకర పోస్టులు పెట్టడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలు.. కొలురు గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు అనుమతి లేకుండా దేవదత్తు గుంత తవ్వడంతో పది రోజుల క్రితం కార్యదర్శి పూడ్చివేసిందన్నారు. దీంతో కోపం పెంచుకున్న దేవదత్తు కార్యదర్శితో పలుమార్లు దురుసుగా ప్రవర్తించడమే గాక మంగళవారం మరో వ్యక్తితో ఫోన్ చేయించి అసభ్యకరంగా తిట్టించాడు. అలాగే దేవదత్తు, బి.స్వామి వాట్సాప్‌లో అసభ్యకర పోస్టులు పెట్టి అవమానపరిచినట్లు చెప్పారు. దీనిపై కార్యదర్శి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రగ్బీ పోటీలకు ఎంపిక

కర్నూలు(రూరల్): మహారాష్ట్రలోని పూణేలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి జూనియర్ బాలుర (అండర్–18) రగ్బీ పోటీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టును రగ్బీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు మంగళవారం బీ.క్యాంప్ క్రీడా మైదానంలో ప్రకటించారు. పోటీలకు ఎంపికైన్న క్రీడాకారులు సాగర్, మహేంద్ర, సింహాద్రి, రాంబాబు, నరసింహారెడ్డి, రాజు, రవికుమార్ రెడ్డి, చంద్రశేఖర్, అనిల్, దుర్గాప్రసాద్, తేజ, మనోజ్‌ను అభినందించారు. టీం మేనేజర్‌గా గణేష్ (చిత్తూరు), కోచ్‌గా వంశీకుమార్ (నెల్లూరు) వ్యవహరిస్తారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే ముస్లింలకు ప్రాధాన్యత


పోస్టర్‌లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, మైనార్టీ నాయకులు

గూడూరు: ముస్లింల మేలు కోరేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. మగళవారం స్థానిక పడమర బీసీ కాలనీ మసీద్ వద్ద 'హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాత్' అనే కరపత్రాలను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి చేయూతనిచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే అన్నారు. ముస్లిం వ్యక్తి డిప్యూటీ సీఎం చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు.

ఎమ్మెల్యేకు అభినందన సభ

పడమర బీసీ కాలనీలో దశాబ్దాలుగా ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే సుధాకర్‌కు కాలనీ వాసులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న, స్థానిక కౌన్సిలర్ ఖలీల్ బాష, జే.ఆబేలు, ఎల్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని నూలుమిల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది మంగళవారం తెలిపారు. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై పాణ్యం చెంచుకాలనీలోని సుంకులా పరమేశ్వరి ఆలయం వద్ద మద్యం అలవాటు మానుకునేందుకు ఇచ్చే పసరు తీసుకుని తిరుగుపయనమయ్యారు. నూలు మిల్లు వద్ద వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడడంతో గాయాలయ్యాయి. వీరిలో ఒకరికి కాలు విరిగినట్లు తెలిసింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.